# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 24, ఏప్రిల్ 2026


# అసాధ్యమైన పనిని సాధించడానికి నిదర్శనం భగీరథుడు

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నస్పూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

నిరంతర ప్రయత్నం, అంకితభావం ఉంటే అసాధ్యమైన పనిని సాధించవచ్చు అని చూపిన మహనీయుడు భగీరథుడు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కష్టతరమైన పనిని సాధించడానికి భగీరథ మహర్షిని స్ఫూర్తిగా చూపిస్తామని, తరాలు మారిన భగీరథుడు సాధించిన విజయాన్ని స్మరిస్తూ ఉంటామని తెలిపారు. తలపెట్టిన పనిని పూర్తి చేసే వరకు ఎంత కాలమైనా అంకితభావంతో ప్రయత్నించాలని, భగీరథుడు ఆచరించి చూపారని తెలిపారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంలో భాగంగా ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భగీరథ మహర్షి సేవలు భారతీయ సంస్కృతిలో చిరస్మరణీయం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :**

భగీరథ మహర్షి సేవలు భారతీయ సంస్కృతిలో చిరస్థాయిగా నిలిచిపోయాయని, చేసిన తపస్సు, కృషి, పట్టుదల అందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, అధికారులతో కలిసి భగీరథ మహర్షి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనం తలపెట్టిన పనిని పూర్తి చేసే వరకు పట్టుదలతో ప్రయత్నించాలని, సమాజ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేయడంలో భగీరథ మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని తెలిపారు. అనంతరం జిల్లాలోని రైతుల నమోదు ప్రక్రియ పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. జిల్లాలోని ప్రతి రైతు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, రైతు భీమా వంటి ప్రభుత్వం పథకాల ఫలాలు అర్హులైన రైతులకు అదేవిధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రైతు భరోసా, రైతు బీమా పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పథకాల అమలులో పెండింగ్ లేకుండా చూసుకోవాలని తెలిపారు. రైతులు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి రైతు తన వివరాలు నమోదు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, అదనపు సంచాలకులు మనోహర్, ఉద్యానవన అధికారి నదీమ్ అహ్మద్, వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# రేపు భైంసాలో ప్రజావాణి

## ఫిర్యాదులు స్వీకరించనున్న జిల్లా ఎస్పీ




**భైంసా, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

అనివార్య కారణాల వల్ల బుధవారం వాయిదా పడిన భైంసా ప్రజావాణి కార్యక్రమం నేడు యథావిధిగా కొనసాగుతుందని జిల్లా ఎస్పీ డా జి జానకి షర్మిల తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24న భైంసాలోని క్యాంపు కార్యాలయంలో ఉదయం నుండి ప్రజల ఫిర్యాదులను స్వయంగా స్వీకరిస్తామని ఎస్పీ వెల్లడించారు. భైంసా డివిజన్ పరిధిలోని ఫిర్యాదుదారులు, బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం వాయిదా పడటంతో ఇబ్బంది పడిన ఫిర్యాదుదారులు నేడు క్యాంపు కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని సూచించారు. నిర్మల్ పోలీస్ మీ పోలీస్ అనే నినాదంతో ప్రజలకు చేరువగా ఉంటూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆమె స్పష్టం చేశారు.



# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త**

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ గురువారం ఉట్నూర్ లోని బస్టాండ్ ఎదుట ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలియజేస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఆర్టిసి కార్మికులకు రెగ్యులరేషన్ చేస్తామని ప్రభుత్వంలో విలీనం చేసి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న హామీలు అమలు కాలేదన్నారు. ఇప్పటికన్నా తక్షణమే ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి జాతికుంట చెరువు సర్వే పర్యవేక్షణ

**- ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం**

**- మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు**

బెల్లంపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



బెల్లంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీలో గల పురాతన జాతికుంట చెరువు సుందరీకరణ పనులలో భాగంగా చేపట్టిన చెరువు విస్తీర్ణ సర్వేను మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని జాతికుంట చెరువును గతంలో కొందరు ఆక్రమణదారులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సూచనల మేరకు సంబంధిత అధికారుల ద్వారా చెరువు భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేయించి హద్దులను ఖరారు చేయిస్తామని వెల్లడించారు. చెరువు హద్దుల్లో అక్రమ నిర్మాణాలు ఉన్నట్లయితే వాటిని తొలగించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. చెరువు సుందరీకరణతో పాటు భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పట్టుదలే ఆయుధం.. డాక్టరేట్ సాధించిన యువ ప్రతిభ

మందమర్రి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



మందమరి మండలం సారంగ పల్లి గ్రామానికి చెందిన యువకుడు పట్టుదలతో చదివి ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టర్ పొందారు. పేద రైతు కూలీ కుటుంబంలో జన్మించి కష్టాలను అధిగమిస్తూ ఉన్నత విద్యలో అరుదైన విజయాన్ని సాధించిన సారంగపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రామగిరి శేఖర్ స్థానికులకు గర్వకారణంగా నిలిచారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సారంగపల్లికి చెందిన రామగిరి లింగయ్య, రత్న దంపతుల కుమారుడు శేఖర్ పట్టుదలతో చదువులు కొనసాగిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ పూర్తి చేశారు. బిజినెస్ మేనేజ్మెంట్ విభాగంలో ప్రొఫెసర్ ఆర్. వెంకటేశ్వర్ మార్గదర్శకత్వంలో హైదరాబాద్లోని ఎలక్ట్రానిక్స్ రిటైల్లో కన్స్యూమర్ డ్యూరబుల్ ఫైనాన్స్ పాత్ర అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగిన శేఖర్ సాధించిన ఈ విజయం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. కష్టపడితే ఏ లక్ష్యమైన సాధించవచ్చని ఆయన నిరూపించారని కొనియాడారు. ఈ సందర్భంగా శేఖర్కు తల్లిదండ్రులు, గ్రామ యువకులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## విద్యతో వెలుగొందిన మంజుల - ఓయూలో పీహెచ్డీ సాధన

మందమర్రి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా మందమర్రి దొర్లబంగ్ల ప్రాంతానికి చెందిన డా. బాసాని మంజుల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ను సాధించారు. ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ సి.హెచ్. మధీధర్ పర్యవేక్షణలో నేటి విద్యా వ్యవస్థ మరియు విద్యార్థుల్లో విలువల పెంపొందించడంలో దాని పాత్ర అనే అంశంపై ఆమె పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనలో విద్యా వ్యవస్థలో విలువల ప్రాధాన్యత, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో విద్య పాత్ర వంటి అంశాలను విశ్లేషణాత్మకంగా పరిశీలించారు. డా. మంజుల తండ్రి బాసాని రాజలింగు సింగరేణి సంస్థలో కోల్కట్టర్గా పనిచేసి పదవీ విరమణ పొందగా, తల్లి గృహిణిగా ఉన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించిన ఆమె, భర్త సూర్యకృష్ణమూర్తి (సబ్ ఇన్స్పెక్టర్) సహకారంతో పరిశోధనను పూర్తి చేశారు. ఈ సందర్భంగా డా. మంజుల మాట్లాడుతూ, గురువులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతోనే ఈ విజయాన్ని సాధించగలిగానని తెలిపారు. ఆమె సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# భూభారతి దరఖాస్తుల పరిష్కారం పకడ్బందీగా చేపట్టాలి

**- కలెక్టర్ కుమార్ దీపక్**

బెల్లంపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, సబ్ కలెక్టర్ మనోజ్తో కలిసి భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు అందించిన దరఖాస్తులను సంబంధిత రికార్డులతో సరిపోల్చి, క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి వేగవంతంగా పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కన్నెపల్లి మండలంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్, తహసిల్దార్ రామచందర్, ఎంపీడీవో శ్రీనివాస్లతో కలిసి భూభారతి దరఖాస్తుల స్థితిని పరిశీలించారు. కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్ల రికార్డులను తనిఖీ చేసి, పనితీరులో మెరుగుదల కోసం పలు సూచనలు చేశారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రహరీ గోడ మరియు భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే పాఠశాలలో మూత్రశాల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. తదుపరి నెన్నెల, తాండూర్ మండలాల తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్, ఆయా మండలాల అధికారులతో భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను సమీక్షించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా పరిష్కార ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు అధికారుల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు.

## డాక్టర్ సురేందర్ మృతి తీరని లోటు

**- మాజీ ఎమ్మెల్యే విఠల్ రావు పటేల్**

భైంసా, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:



భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేందర్ గుండెపోటుతో ఆకాల మరణం చెందడం పట్ల మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం ఆయన సురేందర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ సురేందర్ మరణం భైంసా ప్రాంతానికి తీరని లోటని, ఒక మంచి వైద్యుడిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. ఎందరో నిరుపేదలకు ప్రాణం పోసిన ఆయన, ఇంత చిన్న వయసులోనే మరణించడం జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ బి. చంద్రకాంత్, సందీప్, కుబీర్ మాజీ సర్పంచ్ అరవింద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కలెక్టరేట్లో ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

నిర్మల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా పలువురు అధికారులు, నాయకులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ గంగను భువికి తెచ్చిన మహోన్నత వ్యక్తి భగీరథ మహర్షి అని, ఆయన పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నేటి తరానికి ఆయన గొప్పతనాన్ని, విశేషాలను వివరించడం మన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎల్డీఎం రామ్ గోపాల్, వివిధ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణనకు ప్రజలు సహకరించాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :

జనగణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా మే 11 నుండి జూన్ 9 వరకు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ నెల 26 నుండి మే 10 వరకు ఆన్ లైన్ లో సంబంధిత వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని, జనగణలో భాగంగా అధికారులు ఇంటికి వచ్చినప్పుడు స్వీయ గణన ఐడి అందించవచ్చని తెలిపారు. జన గణన కొరకు అధికారులు వచ్చిన సమయంలో ప్రజలు వాస్తవ సమాచారాన్ని అందించాలని తెలిపారు.



రిటైర్డ్ ఉపాధ్యాయునికి సభ్యత్వమిస్తున్న సంఘం నాయకులు

## ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తాండూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టి ఆర్ ఈ ఏ) బెల్లంపల్లి శాఖ అధ్యక్షుడు సాధు లింగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయులు మాసాడి శ్రీరాములు , గట్టు శ్రీహరి , ముద్దు రాంబాబు , ఇందూరి ఆశన్న లకు గురువారం సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నుండి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులందరికీ వారి బెనిఫిట్స్ వెంటనే ఏక మొత్తంగా విడుదల చేయాలన్నారు. పిఆర్సి ని అమలు చేయాలని, బకాయి ఉన్న ఐదు డిఏలను వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలన్నారు. 398 వేతనంపై నియమితులైన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కారంలో జాప్యం చేస్తే దశలవారీగా ఆందోళనలు, పోరాటాలు చేసేందుకు కూడా వెనుకడమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నర్సయ్య, ఆర్థిక కార్యదర్శి జగన్మోహన్ చారి, ముఖ్య సలహాదారులు అక్కపెల్లి బాపు, వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి: జీఎం రాధాకృష్ణ సమీక్షా సమావేశం

మందమర్రి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ గురువారం ఏరియా పర్సనల్ విభాగం, గనుల సంక్షేమ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక జీఎం కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో డీ.జీ.ఎం (పర్సనల్) సి.హెచ్. అశోక్తో పాటు ఏరియాలోని అన్ని సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, ఉద్యోగుల వ్యక్తిగత మరియు సేవా సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, పర్సనల్ విభాగంలో పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అందే వైద్య సదుపాయాలు, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు, టెర్మినల్ బెనిఫిట్స్ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. డీ.జీ.ఎం (పర్సనల్) అశోక్ మాట్లాడుతూ, జీఎం ఆదేశాల మేరకు ఉద్యోగుల సంక్షేమం కోసం పర్సనల్ విభాగం కట్టుబడి పనిచేస్తుందని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీ.జీ.ఎం ఐఈడీ కిరణ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, గనుల సంక్షేమ అధికారులు, పర్సనల్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.



## జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ

**జన్నారం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎమ్. విజిత్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. విద్యా ప్రమాణాలు పెంచడం, ఫలితాల్లో మెరుగైన స్థానం సాధించడం నా ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన భోధన అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



తాండూర్ తహసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

## భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**తాండూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :**

భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. తాండూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ రికార్డులు, రెవెన్యూ సదస్సులలో ప్రజలు అందించిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా భూభారతి సమస్యల పరిష్కార ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్న పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ చిత్రపటాలకు పాలాభిషేకం

**బెజ్జూర్,ఏప్రిల్ 23,ప్రభాతవార్త:**

బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ బెజ్జూర్ మండల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ దండే విఠల్ డయాలసిస్ సెంటర్ మంజూరు చేయించడం కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న రోగులకు వరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జిల్లా చైర్మన్ కొంద్ర జగ్గాగౌడ్, పెద్దల సుగుణ, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, స్పోక్ పర్సన్ నాహీర్ అలీ, పీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొడప శంకర్, సర్పంచులు సోయం చిన్నయ్య, కొండా రాంప్రసాద్, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.




పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

### కడిగిన ముత్యాల్లా కేసీఆర్, హరీశ్‌రావు..

# బురదలో కూరుకుపోయిన కాంగ్రెస్

**లింగాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త,**



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

లింగాపూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు గురువారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి ఆదేశాల మేరకు కాళేశ్వరం పీసీ ఘోస్ నివేదికపై మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ. కాంగ్రెస్ సర్కార్ వేసిన నేలబారు ఎత్తుగడ ఎదురుతన్నింది. తమ్మిడిహట్టికి వకాల్తా పుచ్చుకున్న ఘోష్ కమిషన్ నివేదికను అడ్డం పెట్టుకొని తెలంగాణ జలదాతను వేధించాలనుకున్న కాంగ్రెస్ కుట్రను ఉన్నత న్యాయస్థానం భగ్నం చేసింది. సీఎం హోదాలో ప్రజల కోసం తీసుకున్న నిర్ణయాలను రాజకీయజోక్యంగా చిత్రీకరించిన జస్టిస్ ఘోస్ట్ నివేదికను వేస్ట్ అంటూ ధర్మాసనం బుట్టదాఖలు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన ఘోరాతి ఘోరమైన గోబెల్స్ ప్రచారం, గురువారం హైకోర్టుతీర్పుతోపటాపంచలైంది. ఈతీర్పునిచ్చిన హైకోర్టుకు ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాధవ్ రాజశేఖర్, చోర్ పల్లి సర్పంచ్ మార్స కోలా అనూష జూగాదిరావు, వార్డు సభ్యుడు మనే మిలింద్, నాయకులు నుణావత్ కిషన్, జాటోత్ రాహుల్, పవార్ గబ్బు సెట్, జాధవ్ రమేష్, జాధవ్ శ్రీకాంత్, రాథోడ్ బావురావు, జాధవ్ కైలాష్, జాధవ్ ఆనంద్ రావు, ఆడే అనిల్ కుమార్, ఆడే పరుశురాం, జాధవ్ ప్రేమ్ సింగ్, జాధవ్ ప్రవీణ్, పవార్ రామారావ్, రాథోడ్ వినోద్, రాథోడ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పదవీ విరమణ మహోత్సవం

**వేమనపల్లి ఏప్రిల్ 23 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. సరోజిని దేవి పదవీ విరమణ మహోత్సవం కార్యక్రమం పాఠశాల ప్రాంగణంలో అత్యంత వేడుకగా, భావోద్వేగాల మధ్య ఘనంగా నిర్వహించారు. సరోజిని దేవి ఈ నెల 30వ తేదీన అధికారికంగా పదవీ విరమణ చేయనున్నారు. అయితే, పాఠశాలలకు వేసవి సెలవుల దృష్ట్యా నేడే చివరి పనిదినం కావడంతో, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ముందస్తుగా ఈ వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి బి. శ్రీధర్ రెడ్డి హాజరై ప్రసంగించారు. సరోజిని దేవి తన సుదీర్ఘ సర్వీస్ లో విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేశారని, ఆమె సేవలు ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సరోజిని దేవి గారిని ఘనంగా సన్మానించారు. తోటి ఉపాధ్యాయులు ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం చివరలో సరోజిని దేవి అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగానికి లోనయ్యారు.



## హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రక్రియ వేగవంతం

**తాండూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రక్రియను వేగవంతం చేసినట్లు వైద్యులు ఝాన్సీ తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో గురువారం 12 మంది బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ వేశారు. మండలంలోనీ 14 నుండీ 15 సంవత్సరాల బాలికలకు ఈ వ్యాక్సినేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 161 అర్హులైన బాలికలు ఉండ గా ఇప్పటివరకు 49 మంది కి వాక్సినేషన్ వేశామన్నారు. మహిళలను వేధిస్తున్న గర్భాశయ ముఖద్వార కేన్సర్ (సర్వికల్ క్యాన్సర్) సహా పలు కేన్సర్లను అరికట్టేందుకు ఈ వాక్సిన్ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.

## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం

**వేమనపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ఎంపీడీవో కుమారస్వామి, పీహెచ్‌సీ డా. అన్వేష్, సర్పంచులు సాయికృష్ణ, చెన్నూరి సమ్మయ్యలు హాజరయ్యారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ భారతి, సువర్ణలు మాట్లాడుతూ అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించడం జరిగిందని అన్నారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు, విటమిన్, తదితర ప్రోటీన్లు ఉన్న ఆహార అర్థాలను తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్యం పట్ల ఎవరు నిర్లక్ష్యం చేయకూడదన్నారు. చిన్నపిల్లలకి మొబైల్ ఫోన్ ఇవ్వకూడదని, మొబైల్ ఫోన్ వల్ల పిల్లలకి కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆరోగ్య కార్యకర్త, గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పెద్దలు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.



## నేరాలకు దూరంగా ఉండి మంచి పౌరులుగా మారండి

### - జన్నారం ఎస్సై జి. ఉదయ్ కిరణ్

**జన్నారం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



నేరాలకు దూరంగా ఉండి మంచి పౌరులుగా మారాలని జన్నారం ఎస్సై జి. ఉదయ్ కిరణ్ అన్నారు. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు గురువారం నాడు కౌన్సిలింగ్ కార్యక్రమం అధికారికంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్ ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, చట్టపరమైన నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. భవిష్యత్తులో ఎటువంటి నేర కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ ప్రవర్తన మార్చుకుని మంచి పౌరులుగా మారి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. జన్నారం పోలీస్ శాఖ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయం...

## - ఘనంగా పార్వతీ రాజేశ్వర్‌రావు పదవీ విరమణ మహోత్సవం



హాజరైన ఉపాధ్యాయులు, తదితరులు



పార్వతీ రాజేశ్వర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఉపాధ్యాయులు

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :**

ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని అరుణోదయ పాఠశాలలో పార్వతీ రాజేశ్వర్‌రావు పదవీ విరమణ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించి సేవలను కొనియాడారు. మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించిన రాజేశ్వర్‌రావు అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా కూడా ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి విశేష కృషి చేశారని అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆహార భద్రత, ప్రమాణాల కమిటీ కన్వీనర్ డాక్టర్ పార్వతీ సత్యనారాయణ మాట్లాడుతూ రాజేశ్వర్‌రావు సేవలు యువ ఉపాధ్యాయులకు ఆదర్శమని అన్నారు. మున్సిపల్ చైర్మన్ షాహీన్ సుల్తానా, ఉపాధ్యక్షురాలు డాక్టర్ అనితా మాట్లాడుతూ విద్యార్థి, ఉపాధ్యాయ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. పట్టణ సభ్యురాలు ఎం.జి. లావణ్య, వ్యవసాయ అధికారి దేవాజీ, జిల్లా క్రీడా అధికారి కటుకం మధుకర్, మండల విద్యా అధికారి ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ రాజేశ్వర్‌రావు సేవలను స్మరించుకున్నారు. ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ జిల్లా అధ్యక్షులు తౌటం శ్యాంసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి మామిడల తిరుపతయ్య, ప్రముఖ ఉపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ తదితరులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. అరుణోదయ పాఠశాల నిర్వహణాధికారి రఘురామ్, ప్రధానోపాధ్యాయురాలు లలిత, సంఘ బాధ్యులు వనమాల రాజేష్, సుధాకర్, రవికుమార్, కాగజ్‌నగర్ అధ్యక్షులు బి.స్వామి, ప్రధాన కార్యదర్శి అంగాల సుమన్, వెంకటరమణ, జిల్లా బాధ్యులు చిలుకూరి రవీందర్, జార్పుల వశ్రామ్, గోపి, శ్రీకాంత్, గోపాల్, రాజ్‌కుమార్, జలపాతి తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ మహిళా సభ్యులు ఉమారాణి, మాధవి పూర్ణిమ, శారద, రజియా సుల్తానా, సుప్రియ, లావణ్య, సునీత, శ్రీలత, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు తన సేవా కాలపు అనుభవాలను పంచుకుని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రతను కాపాడాలని సూచించారు. కార్యక్రమం ఆప్యాయ వాతావరణంలో ముగిసింది.

## జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ

**జన్నారం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

మండల కేంద్రము లోని పొనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నాడు ఉదయం 11:45 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, ఐకేపి సభ్యులు, ప్రజలు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. గ్రామ అభివృద్ధి, సమస్యల పరిష్కారం, పంచాయతీ పాలనకు సంబంధించిన అంశాలపై గ్రామసభలో చర్చించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాహుల్ తెలిపారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

### - దగ్ధమైన మొక్కజొన్న పంట

**సారంగాపూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ కౌలు రైతు సాగు చేసిన మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే రైతుకు అడెల్లి శివారులో రెండెకరాల ఎనిమిది గుంటల భూమి ఉంది. ఈ భూమిని బర్ల భీమన్న అనే రైతు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశారు. పంట పొలం పైనుండి వెళ్తున్న విద్యుత్ తీగలు చాలా కిందికి వేలాడుతున్నాయని, ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైతు గతంలోనే పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో బుధవారం సాయంత్రం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా సమయంలో తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. దీంతో ఎకరం మేర మొక్కజొన్న పంట పూర్తిగా కాలి బూడిదైపోయింది. చేతికి అందిన పంట కళ్లముందే కాలిపోవడంతో, అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతు భీమన్న కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు.





## పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం

**సారంగాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు నేటి నుండి ప్రారంభమయ్యాయి. గురువారం పాఠశాలలకు చివరి పనిదినం కావడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు వార్షిక ఫలితాల ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇంటి వద్దే ఉండి శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున విద్యార్థులు బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తాముపై తరగతులకు వెళ్తున్నామన్న సంతోషంతో విద్యార్థులు ఉత్సాహంగా కనిపించారు. జూన్ నెలలో తిరిగి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు.



గృహ ప్రవేశంలో పాల్గొన్న ఆడే గజేందర్

## సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

### - ఆడే గజేందర్

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

పేదల సొంతింటి కలను నెరవేర్చడం కేవలం ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారుల కోరిక మేరకు పలువురి ఇళ్ల ప్రారంభోత్సవాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబం ఆనందంగా, ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెల్కే పాండురంగ్, నాయకులు చిలుకూరి భూమన్న, సయ్యద్ సల్మాన్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న ముగ్గురు అరెస్ట్

### - రూ. 60,400 విలువైన సరుకు స్వాధీనం

**నేరడిగొండ, ప్రభాతవార్త**




నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ సిగరెట్లను అమాయక ప్రజలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం నలుగురిపై కేసు నమోదు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్. రమేష్ తెలిపారు. నిందితుల నుండి సుమారు రూ. 60,400 విలువైన నకిలీ సిగరెట్లతో పాటు ఒక మోటార్ సైకిల్ మరియు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20న నిజామాబాద్ నుండి నేరడిగొండ వైపు కొందరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై నకిలీ గోల్డ్ ఫ్లేక్ సిగరెట్లను విక్రయించేందుకు వస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు జాతీయ రహదారిపై నిఘా పెట్టారు. తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా కనిపిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులను నిజామాబాద్‌కు చెందిన మహ్మద్ సమ్దాని, మండుల పవన్ కుమార్, ఇమ్రాన్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. కిన్వట్‌కు చెందిన వాసే అనే వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. నిందితుల వద్ద ఉన్న సరుకును కంపెనీ ప్రతినిధులు పరిశీలించగా, అన్ని ప్యాకెట్లపై ఒకే రకమైన యూఐడీ (గీ.దీ) నంబర్లు ఉండటంతో అవి నకిలీవని తేలింది. నిందితులను రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నామని సీఐ రమేష్ వివరించారు. ప్రజలు ఇటువంటి నకిలీ ఉత్పత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# నూతన గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**నేరడిగొండ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పలు నూతన గృహ ప్రవేశ కార్యక్రమాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల నర్సయ్య, లక్కవత్తుల శేఖర్‌లకు చెందిన నూతన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేదల సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

